# మునిమాపు వయసులో...

అసలు ఏదైనా చదవవలసివస్తే ఎడమవైపు నుంచి కుడివైపుకు చదువుతాం. ఉరుదూ భాష కుడివైపునుంచి ఎడమవైపుకు చదువుతారు. చైనా భాష పైనుంచి కిందికి నిలువుగా చదవాలిట. మా వాడి వుత్తరం నేను కిందనుంచి పైకి చదువుతాను. ఎంచేతంటే, ఆ వుత్తరంయొక్క సారాంశం చివర అంగుళం మేరలోనూ యిమిడివుండి-ధగధగ మెరుస్తూ వుంటుంది. ఒక్కొక్కసారి దాని కేసి చూసేటప్పటికి కళ్ళు చీకట్లు కమ్మడం కూడా కద్దు. ఇంతకీ ఈ నెల వచ్చిన వుత్తరంలో ఆఖరు వాక్యం ఇది- "అందుచేత ఈ నెల మీరు పంపవల్సినది రు. 150/-."

ఏ నెల కానెల ఖర్చు తగ్గించమని నేను రాస్తూనే వున్నాను. మరి వాడి ఖర్చులేమో పెరగడమేకాని తరగడం కనబడటంలేదు. నూటయాభై రూపాయిలు - హుం....ఇంతోటి బియ్యే చదువుకి! తరవాత వీడు నెలకి నూటయాభై కాన్లు సంపాదిస్తాడో లేదో కాని. ఏమయితే అయ్యింది ఈ నెల నూరు పంపిస్తాను- అంతే. అసలు నాకు యీ బ్లడ్‌ప్రెషర్ రోగం వీడి మూలాన్నే వచ్చింది. అదిగో - వొంటింట్లో కంచాలు తోముతున్న చప్పుడు వినబడుతుంది. ఇంకో పది నిముషాల్లో మా ఆవిడొస్తుంది. ఏమయితే అయ్యింది. అంతే, మా ఆవిడతోటి, మా అమ్మాయితోటీ చెప్పేస్తాను. నాకేం భయమా? ఇలా నిర్ధారణ చేసుకుని, చుట్టపతల పారేసి పడక కుర్చీ మీద కాళ్ళు జాపుకు పడుకుని మా ఆవిడకోసం ఎదురుచూస్తూ, రాబోయే ప్రళయాన్ని ఊహించుకుంటూ, నే ధరించవల్సిన పాత్ర రిహార్సల్ వేసుకుంటూ, మనస్సులో కత్తి నూరుకుంటూ 'ఆపదలందు ధైర్యగుణం బంచిత....' పద్యాన్ని వల్లించుకుంటూ కళ్ళు మూసుకున్నాను.

‘‘ఏమండీ, ఏమండీ!’’ మా ఆవిడ పిలుపు మగతగా విని కళ్ళు తెరిచాను. కన్నీళ్ళతో ఎదురుగుండా మా ఆవిడ నిలబడి ‘ఏమండీ.... అమ్మాయికీ....’ అనబోతోంది.

‘హా!’ అంటూ ఉలిక్కిపడి లేచాను. ‘హారి భగవంతుడా! ఏమిటీ పిడుగు వంటి వార్త? ఏమి వినిపించబోతున్నావు తండ్రీ! ఏం కొంప మునిగింది? ఇదంతా నూటయాభై పంపించమని రాస్తే నూరు పంపిద్దామనుకున్న పాపానికి ఫలితమా ఏమిటి?’ అనుకుంటూ పడక్కుర్చీమీదనుంచి లేచి పంచె కుచ్చిళ్ళు సర్దుకుంటూ దిక్కుతోచక బొంగురుపోయిన గొంతుకుతోటి ‘‘ఏమయిందే? అమ్మాయేదీ? సంగతేమిటి? త్వరగా చెప్పు’’ అన్నాను.

‘‘అదికాదండీ! .... అమ్మాయికూడా యింటో లేదు అనబోతున్నాను. ఉత్తరంలో ఏముందో చదివి చేత్తోపట్టుకొని మీ రలాగే పడక్కుర్చీలో నోటమ్మట మాట రాకుండా పడిపోయారు, ఇంతకీ అల్లుడు ఒంట్లో ఏమీ లేకుండా కులాసాగా ఉన్నట్లేనా?’’ అంది మా ఆవిడ పమిటచెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ.

అప్పుడు నాకు సంగతి అర్థమయ్యింది. కాని, ఒక్క క్షణంలో మనస్సు పరిపరివిధాల పోయిందేమో యింకా ఆపాదమస్తకం వణికిపోతూనేవుంది. ఇలా నా హృదయవేదన కనుగుణ్యంగా శరీరం తాళం వేస్తుంటే దానికి తగ్గట్టు చేతిలో వుత్తరం నాట్యం చేస్తోంది. మళ్ళీ మా ఆవిడ కళ్ళలో ఒక నూతన అశ్రుతరంగం ఇంతకీ నా నోరు పెగల్లేదు. ఆ ప్రయత్నంలో పెదిమలు తడిచేసుకుంటున్నా. ఇంతలో అనుకున్నంతపనీ అయింది. మా అమ్మాయి. వచ్చింది. అసలే సూక్ష్మ గ్రాహి. గుమ్మంలోంచే మా అల్లుడు దస్తూరి అనవాలు కట్టింది. మా ఆవిడ మొహంలోకి చూసింది. నా పరిస్థితి గమనించింది. క్షణంలో జరిగినదంతా గ్రహించినదానిలాగ గుండె చెరువయ్యేటట్లు ‘నాన్నా!’ అంటూ ఒక్క పరుగులో వచ్చి నన్ను కౌగిలించుకొని నా చేతుల్లోంచి జారిపోతున్న వుత్తరాన్ని అందుకుంది. ‘శారదా! అంటూ మా అమ్మాయి నొక్కసారి కౌగిలించుకున్నట్టూ, ‘‘ఆఁ ........ఏముంది ఉత్తరంలో........’అంటూ మా ఆవిడ వెర్రికేక వేసినట్టూ, నా కాళ్ళు అమాంతంగా అప్పడాల పిండలా అయిపోయినట్టూ చూచాయగా గుర్తుంది

ఒంటిమీద స్పృహవచ్చేటప్పటికి పడక్కుర్చీలో వున్నాను. మా అమ్మాయి చెంచాతో హార్లిక్స్ గొంతుకులో పోస్తోంది. గుండెల్లో మాత్రం యింకా మిలిటరీ

బ్యాండ్ మోగుతున్నట్టే వుంది. స్మృతి శిథిలాలు తవ్వి గతచరిత్ర జ్ఞాపకం తెచ్చుకున్నాను. అసలు కష్టాలన్నీ మానవుడికి అంత్యదశలో వస్తాయి. అందుకు సాయం జవసత్త్వలుకూడా అప్పుడే సన్నగిల్లుతాయి. వార్ధక్యం మధ్యలోనూ యౌవనం అంత్యంలోనూ వుండకపోవటం భగవంతుడి తెలివితక్కువవల్ల మానవుడికి సంక్రమించిన దురదృష్టాల్లో ఒకటి. ఇందాకటి నా బ్లడ్‌ప్రెషర్ తోటి....అసలు దాన్ని ఉపయోగించుకొనే మేధావి లేకపోయాడు కాని, ఆమాంతంగా మెడ్రాస్ మెయిల్‌ని ఇంజన్ లేకుండా గంటలో కలకత్తా లాక్కుపోవచ్చు. అంతకీ ఎంత విచిత్ర సంఘటన? తల్లీకూతురూ కలిసి నా ప్రాణాలు తీసేద్దురు.!

''ఏమీ లేందే ఎంత గాభరా పెట్టేశారండీ'' అంటూ అందుకుంది మా ఆవిడ మూలనుంచి తమలపాకులు రాస్తూ.

పైగా, గాభరా పెట్టింది నేనట! కొంప మునిగిపోయినట్టు ఏడుపు మొహంతో ప్రత్యక్షమయ్యి ఖంగారు పెట్టింది తనూ. ఇంతకీ కాస్త సద్దుకుని సమాధాన మివ్వడానికేనా వ్యవధి లేకుండా అమ్మాయొచ్చి బారుమంది. నేనేం చెయ్యనూ? నాకు కాళ్ళాడలేదు.

''మనస్సు పరిపరివిధాల పోయింది. ఏ కొంప మునిగిందో అనుకున్నాను'' అంది మా ఆవిడ.

''అదేమిటి నాన్నా, అంతలా ఖంగారు పెట్టేశావు? నాకసలు పై ప్రాణాలు పైకే పోయాయి'' అంది శారద.

నా ప్రాణాలసలు పోయి మళ్ళీ వచ్చేయి. చచ్చి బతికేను. నేనెవరితో చెప్పకోను? పైగా, తప్పంతా నాదిట! అనుకుంటే అనుకోనీ-నాకేం? పోనీ, యీ పూట తమలపాకులివ్వదేమో-అంతేనా? హుఁ....

''అవ్వ! అవ్వ! ఎవళ్ళైనా వింటే నవ్విపోతారు. నిక్షేపంలాంటి పుత్తరం వొస్తే ఎంత గందరగోళం చేశారు? 'అల్లుడు కులాసాగా వున్నాడా?' అని మహాను భావుణ్ణడుగుతే గుడ్లప్పగించి నాకేసి బెదురుచూపులు చూస్తారుగాని, మాట్లాడరు కదా!''

ఇవి భార్యనవలసిన మాట్లేనా? వయస్సులో వున్నప్పుడు యీవిడ సీతా అనసూయల్ని మరపించేటంత పతివ్రత! సరే, యిప్పుడు అన్నిటితోబాటూ పాతి

ప్రత్యం సన్నగిల్లింది. వక్కపొడి నోట్లో వేసుకుంది - తమలపాకులు తనకేనన్న మాట!

''కళ్ళజోడు పెట్టుకునే చదివేవా నాన్నా?''

తల్లికి మించిన కూతురు. నవ్వు నవ్వు. వేళాకోళంగానే వుంటుంది. నేను చావవల్సింది. అప్పుడు తెలుసును.

''పాపం మొన్న వుత్తరంలో సుస్తీగా వుందని రాశాడా? ఇవ్వాళ వుత్తరం రాగానే ఈయనగారు కాళ్ళాడకుండా పడక్కుర్చీలో చతికిలబడ్డారాయిరి. ఇంకేమనుకోనూ?''

''మొన్న వుత్తరం వచ్చింది మొదలు నాకు మనస్సు మనస్సులో లేదు. ఇందాకా చూద్దునుకదా, నువ్వు కంటతడి పెట్టుకున్నావు నాన్నేమో వుత్తరంతో సహా వొణికిపోతున్నారు. నేను మాత్రం ఏమనుకోనూ?''

ఏమిటి అనుకునేది వీళ్ళ మొహం! చచ్చేడనుకున్నారా? నా నోటికి తిన్నగా రాదుకాని వాడిదగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. చచ్చినవాడు వుత్తరం రాయడు కదా? ఇంతా చేస్తే వాడికొచ్చిన రోగమల్లా జలుబు చేసి పడిశం పట్టిందిట. ఏంతిన్నా ఓలాగే వుందిట ఇక్కడ నేను ఈ జ్వరంతోటి చావలేక చస్తున్నాను కాని అక్కడ వాడు రొంపట్టి చస్తాడేమోనని వీళ్ళకి భయం. మళ్ళీ ఏమైనా అంటే ఏడుస్తారు....ఇంతకి నాకివ్వాళ తమలపాకులాశ లేదన్నమాట! పోనీలే, ఒక్కపూటలో నోరు పడిపోదు.

''కాదుటే తల్లీ....కాస్తా కూస్తా దూరం కనకనా పోనీ ఓసారి వెళ్ళి చూసొద్దామనుకోడానికి? యాభై అరవై మైళ్ళుంది. పూట ప్రయాణం. ఇంతకి పలకరిస్తేనే మనిషి కాదుకదా. ఈయన్ని నమ్ముకుని ప్రయాణం చేసే దేమిటి? ఇంక యీ జన్మకి ఒకటే ప్రయాణం.''

అను అను. నోటికొచ్చినట్లల్లా అను. రేపు నువ్వు చచ్చిన తర్వాత వైతరణీనది దాటుతున్నప్పుడు నన్నిప్పుడన్న ఒక్కొక్కమాటా ఒక్కొక్క జలగై పీక్కుతిన్నప్పుడు తెలుస్తుంది....అదిగో, వేసేసుకుంది తమలపాకులు. మిగిలిన ఆ కాసిన్నీ యిచ్చినా చాలు. ఎందుకిస్తుందీ, చిలకలు చుట్టి మరీ వేసుకుంటుంది!

"ఇవ్వాళ యిక్కడ జరిగిన గందరగోళం టైము, అక్కడ ఆయన భోజనంచేసే టైమూ ఒకటే పాపం! పొలక మార్తుంది కూడాను.''

పొలకా మారుతుంది తుమ్మూ వొస్తుంది. అదీ ప్రమాదమే? ఈ ప్రేమ ఈ ఆరాటన పీళ్ళాయినకి నా వయస్సు, దీనికి మా ఆవిడ వయస్సూ వచ్చినప్పుడుండాలి.

''పొలక మారేటంత సేపు విస్తరి దగ్గిర కూర్చుంటాడుటే, పాపం! అసలు అన్నహితవే పోయిందిట.''

''ఉత్త హార్లిక్సూ బిస్కట్లూ పళ్ళరసం తాగుతున్నారుట మొన్నట్నుంచీ." కూతురు ఆరాటానికి తల్లి వంత పాడుతోంది.

మరేం ఫరవాలేదు. ఇదిగో ఇలా పెంచే వాణ్ణీ పాతికేళ్ళకి ఏనుగంత మనిషిని చేశారు. చీమకున్నంత మెదడున్నా లేకపోయినా, ఏదో తల్లీ తండ్రీలేని మేనల్లుడు కదా అని దగ్గిరుంచుకుని పిల్లనిచ్చి పెళ్ళి చేశాను. చదివించి వృద్ధిలోకి తీసుకొద్దామనుకుంటే బకాసురిడిలా తయారు చేశారు తల్లీ కూతూరూ కలిసి. నూటయాభై రూపాయిలు పంపాలిట- నూటయాభై రూపాయిలు!

"కాస్తైనా వోర్చుకోలేడు. పాపం! ఎంత నీరసించిపోయాడో ఏమిటో!" మా ఆవిడ కంగారు.

"రెండు రోజుల్నుంచి కసరత్తు చెయ్యటం కూడా మానేశారుట." శారద బాధ.

శని విరగడయ్యింది. దిక్కుమాలిన కసరత్తు. నా కసలు వాడి గదిలోకి వెడితే యమలోకంలో కెళ్ళినట్టుంటుంది. ఆ గదిలో ఆ అద్దం, ఆ ఆంజనేయులూ దారాసింగూ కోడి రామ్మూర్తి ఫోటోలు ఆ గదలూ యినపగుళ్ళూ ఆ అట్టహాసం ...అబ్బబ్బ! అసలు నాకు సగం బ్లడ్‌ప్రషర్ రోగం వీడి కసరత్తు చప్పుడువల్లనే వచ్చింది. అసలు తలుచుకుంటేనే గుండెల్లో రోడ్‌రోలరు పరిగెడుతున్నట్టుంటుంది....అదేమిటీ, ఆ తమలపాకులు గూట్లో పెట్టిందీ!

"ఏం చదువులు, ఏం లోకం. ఇంటి పట్టునుండి పట్టెడన్నం కడుపునిండా తినడానికి లేదుకదా. ఏదో ఈ యేటితోనైనా ఆ బియ్యే కాస్తా పూర్తవుతే...." మా ఆవిడ ఆశ.

''పాపం! కిందటి పరీక్షలకి ఎంత కష్టపడి చదివేరూ! చివరకన్నీ పుస్తకాల్లో లేని ప్రశ్న లడిగేరుట." శారద నమ్మకం.

ఓరి వీళ్ళ అమాయకత్వం తగలెయ్యా! వాడు చెప్పడం ఎలా ఏడిసిందో వీళ్ళ నమ్మకమూ అలాగే వుంది. వాడూ మీరూ గంగలోకి దిగండి, నా కెందుకు? అసలు చదువుకునేవాడి కుండవల్సిన లక్షణాల్లో ఒక్కటికూడా లేదు వాడికి. మూడేళ్ళనా తగలెయ్యకుండా ఎందులో ప్యాసయ్యేడు? మొన్నటిసారి పరీక్ష లాఖరుని ఎలా రాశావురా అంటే బ్రహ్మాండంగా రాశా నన్నాడు. తీరా, రిజల్ట్స్ పత్రిక ఏమయ్యిందిరా అంటే నవ్వుతూ 'స్టెప్పింగ్ స్టోన్ టు సక్సెస్ మామయ్యా' అంటాడు. వాడికేం సిగ్గా ఎగ్గా?

"పోనీ.... అమ్మా!.... ఈ సెప్టెంబర్ పరీక్షలో ప్యాసైతే తిరపతి వెడతా మని మొక్కుకుంటే...."

భేష్! ఇంక దొక్కటే తరవాయి ఆ దెబ్బతోటి నాకు పక్షవాతం కూడా తయారవుతుంది

"ఇంకా నయం. అలాంటి మొక్కులేమీ మొక్క కు తల్లీ! ఆయన యిది వరకు మనిషి కాదు, ఆ ఓపికా లేదు. తిరపతీ వద్దు - వైకుంఠమూ వద్దు "

ఓహోహో! ఇదంతా నా మీద భక్తా? నా పెన్షన్‌మీద భక్తా?

"అబ్బే!.... ఛా.... ఇప్పుడెలా వెడతామే? నాన్నగారికి బాగా తగ్గేకే వెడతాం."

తగ్గాలి కదా? నాకు మతిపోయేలోగా వీడి చదువు పూర్తయ్యి ఆ కసరత్తులూ, ఆ కత్తిసాములూ, ఆ కాటాకుస్తీలూ మాని నాలుగు రాళ్ళు సంపా దించుకొనేటంత యోగ్యుడైతే నాకు తగినంత ఫలితం.... అదిగో వక్కపొడి డబ్బా తీస్తోంది.

"తగ్గనీ తల్లీ!.... అలాగే వెడదాం. తెల్లారిలేస్తే వెయ్యిదేముళ్ళకి మొక్కు తున్నాం. ఆ ఏడుకొండలవాడికే దయుండాలి కాని అన్నీ అనుకూలిస్తే ఆ తిరుపతి వెళ్ళడం ఎంత పని.... ఈ వక్కపొడి తమలపాకులూ మీ నాన్నగారి కిచ్చిరా అమ్మా!''

"నాన్నగారికి తగ్గిపోతే తిరపతి వెడదామని నువ్వు మొక్కుకున్నావు కాదుటే? నాన్నగారికి తగ్గగానే ఎలాగా వెడతాం. దానితోబాటు యీ మొక్కూ తీర్చుకోవచ్చునని అన్నాను."

సరిసరి. అప్పుడే అయింది. మొక్కుకుందన్నమాట! ఒత్తి పిరికి మనిషి. అసలే నేనంటే యిది. అందులోనూ దైవభక్తి కూడా ఎక్కువేమో-మొక్కుకుని వుంటుంది.

"ఇంద నాన్నా!... ఉండు కాస్త మెత్తటి వక్కపొడి యిస్తాను. ఇంద - ఇప్పుడు నింపాదిగా వుందా?"

మొన్న సంతలో కొన్న తుని తమలపాకులనుకుంటాను. నోట్లో వేసుకుంటేనే కరిగిపోతున్నాయి. నిజానికి తమలపాకులు రాస్తే మా ఆవిడే రాయాలి. నా కోపంకొద్దీ ఏవో శాపనార్థా లెట్టుగుంటాను కాని, నేనంటే దాని కెప్పుడూ పంచప్రాణాలూను.

"నాన్నా... బావ కీనెల నూటయాభై రూపాయలు పంపాలిట."

దీని కెప్పుడూ బావ గొడవే! అయినా దాని తప్పేముంది? నా మీద మా ఆవిడకున్న మనస్సులాంటిదే దీనికి వాళ్ళాయినమీద వుంది. ఇంతకీ దీనికి మాత్రం నేనంటే తక్కువ ప్రేమా? మొన్న నేనో లంఖణం చేసేటప్పటికి మంచాన్నంటి పెట్టుకుని అల్లాడిపోయింది.

"అదేమిటే .... వెర్రితల్లీ .... అలా చిన్న మొహం చేసుకుంటావు...."

"అదికాదే ఏనెల కానెల ఖర్చు పెంపుతుంటే నాన్నగారు మాత్రం ఎక్కడనుండి తెస్తారు?"

"ఇంకా నయం. పాపం! అంతదూరాన్నున్నాడు, ఏమిబ్బందిపడుతూ రాశాడో? అదీకాక అతనేమీ దుబారా ఖర్చు చేసేమనిషి కాడు."

దుబారా ఖర్చు చెయ్యడంటే నే నొప్పుకోను. ఇంతకీ చెడుబుద్ధులేమీ లేవు. బుద్ధిమంతుడు. భయభక్తులున్నవాడు. వీటితో ఆ సరస్వతీ కటాక్షంకూడా వుంటే బాగుండును. ఏదో ఈసారయినా పరీక్ష గట్టెక్కితే .... ఇంతకి యీ నెల నూటయాభై రూపాయలు పంపించటం ఎలాగా తప్పదు. నిజానికి పది రూపాయలు ఎక్కువ పంపిస్తే పాడయిపోయీవాణ్ణి పది రూపాయలు తక్కువ పంపించి రక్షించగలమా!

"నాన్నా!... ఇవ్వాళ యింకా పోస్టుకి టైముంది. నేను ఉత్తరం రాస్తాను. నువ్వో చెక్కు రాసియ్యి నాన్నా .... నేను పంపించేస్తాను!" అంది శారద.

సరే అన్నట్లు తలవూపేను.

*